
సాక్షి
గుంటూరు
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళ వారం 1902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



## జెడ్పీ భూముల పరిశీలన

నాదెండ్ల: గణపవరం గ్రామంలో జెడ్పీ భూము లను మంగళవారం ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ప్రస్తుత లీజుదారుల అర్జీ మేరకు పరిశీలించినట్టు సమాచారం.



## సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

అమరావతి: గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యా లు అనే అంశంపై మంగళవారం శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఏపీ ఎస్ఐఆర్‌డీ మాని టరింగ్ అధికారి కె.మోహన్‌రావు పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచారు

- మరోసారి రైతులను మోసగించిన కూటమి ప్రభుత్వం
- కేంద్రాల్లో 10 శాతం కూడా కొనుగోలు చేయడం లేదు
- ఊరూరా ప్రచారం మాత్రం హోరెత్తించారు
- ఈనెల 13న జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

### అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ



ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

తాడేపల్లిరూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఎన్నో వాగ్దానాలు చేసి తీరా అధికా రంలోకి వచ్చిన తరువాత రైతులను నట్టేట ముంచిం దని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. మంగ ళవారం పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హను మంతరావు, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మ కాయల రాజప్పలతో కలసి గుంటూరు జిల్లా తాడేప ల్లి రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్లపై రాశు లుగా పోసి వున్న ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు అధి కారంలోకి వచ్చేందుకు కల్లబొల్లి మాటలు చెప్పార న్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి రైతులను నిలువునా మోసం చేశార న్నారు. రబీ సీజన్ అయిపోయినా రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేదన్నారు. రైతుల వద్ద నుంచి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, దళారులకు ఎవరూ అమ్మవద్దని, దళారులు ఎవరైనా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని కూటమి నేతలు ఊరూరా ప్రచారం నిర్వ హించారని, అయితే వాస్తవ పరిస్థితులను చూస్తే ఇప్పటివరకు 10 శాతం కూడా ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాన్యానికి మద్దతు ధర ప్రకటిస్తూ 75 కేజీల ధాన్యం బస్తాను రూ.2వేలకు కొనుగోలు చేశారన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొన్నారన్నారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈనెల 13వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క రైతు పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. పార్టీ తాడేపల్లి రూరల్ అధ్య క్షుడు అమరా నాగయ్య, మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు చిలువూరి రజనీకాంత్, తాడేపల్లి రూరల్, పట్టణ రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, రుక్మాంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రైతులతో రాజకీయాలేంటి..?



ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించమని అధికారులను అడిగితే ధాన్యంలో మట్టిగడ్డలు ఉన్నాయని కుంటిసాకులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీకి పనిచేశావు కాబట్టి నీ ధాన్యం కొనుగోలు చేయమని అధికా రులు అంటున్నారు. రైతులతో రాజకీయాలు ఏమిటో అర్థం కావడం లేదు.

– వీరిశెట్టి సాంబయ్య, చిర్రావూరు

### గిట్టుబాటు ధరే లేదు



ఈ సంవత్సరం పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరే లేదు. గత ప్రభుత్వంలో వ్యాపారులే రూ.1800 నుం చి రూ. 2 వేలకు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం 40 బస్తాలు మాత్రమే ప్రభుత్వం కొనింది. మిగిలినదంతా వ్యాపారు లకు రూ.1350కే అమ్మేందుకు సిద్ధమయ్యాను. అధికారులు ఎవరూ మా వంక చూడడం లేదు.

– దావులూరి నాగేశ్వరరావు, గుండిమెడ

### కన్నెత్తి చూసినవారు లేరు..



రైతుల వద్దకు రైతు సేవా కేంద్రం నుంచి ఎవరూ రావడం లేదు. కోత కోసి ఇప్పటికే వారం దాటింది. చేలో నుంచి ధాన్యాన్ని రోడ్డుపైకి చేర్చాం. మద్దతు ధర వస్తే అమ్ముదాం అని పట్టాలు కప్పి ఉంచాం. దళారులు రూ.1350 ఇస్తామంటున్నారు. గతంలో ఆర్బీకేలో బస్తా రూ.2 వేలకు అమ్మాం.

– అడపా సూరి, చిర్రావూరు



విలేకరులతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు, పక్కన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తూములూరు(తెనాలి): పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ముఖ్యమంత్రి కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకుండా దళారులకు వదిలేసిం దని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆరోపించారు. టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని చెప్పారు. ప్రభుత్వం వదిలేయటంతో రైతులు అయినకాడికి అమ్ముకుంటున్నారని తెలి పారు. డెల్టాలోని తెనాలితోపాటు మంగళగిరి నియోజకవర్గంలోనూ ఇదే తరహాలో రైతులు ఇబ్బందులు పడుతుంటే, ఇతర నియోజకవ ర్గాల్లోని పరిస్థితి అర్థం చేసుకోవచ్చని అన్నారు. టీడీపీ ఎప్పుడూ రైతు వ్యతిరేక ప్రభుత్వమేనని

### మంత్రుల నియోజకవర్గాల్లోనే దిక్కులేదు

పండించిన పంటలో కనీసం ఒక శాతం కూడా కొనుగోలు చేయకపోవటం రైతులను మోసం చేసినట్టు కాదా అని ప్రశ్నించారు. తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నేత లతో కలిసి మంగళవారం సాయంత్రం కొల్లిపర మండలం తూములూరు గ్రామాన్ని అంబటి రాంబాబు సందర్శించారు. కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించి, అక్కడి రైతులతో మాట్లాడారు. గ్రామంలోని రైతుసేవాకేంద్రానికి వెళ్లి, అక్కడ ధాన్యం కొనుగోలు వివరాలను తెలుసుకు న్నారు. అక్కడే విలేకరులతో మాట్లాడారు. 'వరి ధాన్యం ప్రతి గింజా కొంటాం...రైతులకు నష్టం జరగదు...నాదీ బాధ్యత' అంటూ పౌరసరఫరా లశాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనో హర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కొల్లిపర మండలంలో 31,500 మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తే, అందులో కేవలం 1400–1500 అంబటి అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశంతో జిల్లాలోని ధాన్యం రైతుల కష్టాలను తెలుసుకుని, ఈనెల 13న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నామ న్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ మాట్లాడుతూ తూములూరు రైతుసేవా కేంద్రం పరిధిలో 950 ఎకరాలుంటే అందులో 30 వేల బస్తాల ధాన్యం పండితే, 1200 బస్తాలు మాత్రమే కొనుగోలు చేసినట్టు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయాలని వెళ్లిన రైతులకు తేమ శాతం చూసే టెక్నికల్ అసిస్టెంట్లు కూడా రావటం లేదని, ఆ కేంద్రాల పరిధిలోని వ్యవ సాయ సహాయకులే నిస్సహాయతను వ్యక్తం చేస్తుండటం ప్రస్తుత దుస్థితికి అద్దంపడుతుం దన్నారు. పార్టీ కొల్లిపర మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, పార్టీ జిల్లా రైతుసంఘం అధ్య క్షుడు బొమ్ము శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

## న్యూస్‌రీల్

### క్రీడలతో ఉద్యోగ అవకాశాలు



మంగళగిరి: నగర పరిధిలోని ఏపీఎస్పీ బెటాలి యన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్పోర్ట్స్ మీట్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజ రైన బెటాలియన్ కమాండెంట్ బి.రాజకుమారి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిం చాలని కోరారు. క్రీడలతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కమాండెంట్ కె.నగేష్, అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం , ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, ఆక్టోపస్ కమాం డెంట్ మాదిరెడ్డి ప్రతాప్ పాల్గొన్నారు.

### శబరిమలకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివి జన్ పరిధిలోని అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం అదనపు ప్రత్యేక రైళ్లను కేటాయించడం జరిగిం దని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళ వారం వెల్లడించారు. సికింద్రాబాద్–కొల్లం (07175) ప్రత్యేక రైలు ఈనెల 19, 26 తేదీలలో కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు సికింద్రబాద్ స్టేషన్ నుంచి రాత్రి 8 గంటలకు బయలు దేరి కొల్లం స్టేషన్‌కు రెండో రోజు రాత్రి 1.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. కొల్లం–సికింద్రా బాద్(07176) ప్రత్యేక రైలు ఈనెల 21, 28వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. ఈ రైలు కొల్లం స్టేషన్ నుంచి తెల్లవారు జామున 5 గం టలకు బయలు దేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు ప్రధానంగా మౌలాలీ, చర్లపల్లి, నల్గొండ, మిరి యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్‌పడి, వేల్లూరు, తిరునమలై, విల్లుపురం, మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

### ఇంజినీరింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు

నెహ్రూనగర్: గుంటూరు కార్పొరేషన్ పరి ధిలోని గోరంట్ల ప్రాంతంలో ఆదివారం జరి గిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నగర మేయ ర్‌ను ఆహ్వానించకపోవడం, శిలాఫలకంలో కూడా ఆయన పేరును చివరిన వేసి అధి కారులు ప్రొటోకాల్ ఉల్లంఘించిన వైనంపై 'అధికార 'పచ్చ'మే' శీర్షికన ఈనెల 9న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై మేయర్ ప్రొటోకాల్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, వివరణ ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసు లుకు లేఖ రాశారు. మేయర్ రాసిన లేఖకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పందిం చారు. మేయర్‌ను ఆహ్వానించకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించిన ఇంజినీరింగ్ అధికా రులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఇంజినీ రింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

### 'కౌశల్–2024'కు 12 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాస్థా యిలో డిసెంబర్ 6వ జరిగిన కౌశల్–2024 పోటీల్లో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈనెల 29, 30వ తేదీల్లో విజయవాడలో జరగ నున్న రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.

**విజేతలు వీరే..**

కౌశల్–2024 జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో చిం తా ఉమిక (జెడ్పీ హైస్కూల్, అబ్బినేనిగుం టపాలెం), తోటకూర జ్ఞానదీపిక, బడే అవంతిక అన్నపూర్ణ (జెడ్పీ హైస్కూల్, ముట్లూరు) ప్రథమస్థానంలో నిలువగా, వడ్డే వెంకటసాయి (జెడ్పీ హైస్కూల్, నల్లపాడు), కొణిదల నందిని (జెడ్పీ హైస్కూల్, కాత్ర పాడు), కుక్కమళ్ల ఆదర్ష్ (జెడ్పీ హైస్కూల్, జొన్నలగడ్డ) ద్వితీయస్థానంలో నిలిచారు. పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో 8వ తరగతి విద్యార్థులు నేలటూరి సుస్మితాచంద్, సందు మోక్షిత (జెడ్పీ హైస్కూల్, ముట్లూరు), 9వ తరగతి విద్యార్థులు ఎద్దు చంద్రిక (జెడ్పీ హైస్కూల్, కాత్రపాడు), షేక్ రషీద్ జాయ్ (జెడ్పీ హైస్కూల్, అంకిరెడ్డిపాలెం), రీల్స్ విభాగంలో 10వ తరగతి విద్యార్థులు అడు సుమల్లి లక్ష్మీనాగసాయి సుధీక్షణ (జెడ్పీ హైస్కూల్, పాన్నూరు), పాల జ్యోతి నాగ మణి (జెడ్పీ హైస్కూల్, ముట్లూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలి చారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.1,500, రూ.వెయ్యి చొప్పున నగదు అందజేస్తారని కౌశల్ జిల్లా సమన్వయకర్త మన్నవ సురేష్ కుమార్ తెలిపారు.

# 55 ఏళ్లు పైబడిన వారే టార్గెట్

- ఆటోల్లో ఒంటరి ప్రయాణికులను దోచుకునే 10 మంది అరెస్ట్
- వీరంతా గుంటూరు నగరానికి చెందినవారే..
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో జిల్లా ఏఎస్పీ సుప్రజ, డీఎస్పీ

నగరంపాలెం: ఆటోల్లో ఒంటరిగా ప్రయాణించే వారిని బెదిరించి నగలు, నగదు ఎత్తుకెళ్లే ముఠాలోని పది మందిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. వారి నుంచి 15 గ్రాముల బం గారు వస్తువులు, రూ.50 వేలు నగదు, మూడు ఆటోలు సీజ్ చేశామని అన్నారు. జిల్లా పోలీస్ కార్యా లయ (డీపీఓ) ఆవరణలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలను ఆయన తెలిపారు. ఇటీవల తెనాలి మూడో పట్టణ పీఎస్ పరి ధిలో ఆటోల్లో ఒంటరిగా ప్రయాణించే 55–70 ఏళ్ల వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మం గళవారం తెనాలి సుల్తాన్ బాద్, ఆర్టీసీ బస్టాండ్, వీఎస్ఆర్, ఎన్‌వీఆర్ వద్ద ఆటోల్లో అనుమానాస్ప దంగా సంచరిస్తోన్న పలు వురిని అదుపులోకి తీసుకు న్నట్లు చెప్పారు. విచార ణలో నేరం రుజువు కావడం తో గుంటూరు కొరిటెపాడు నా యుడు పేట రెండో వీధికి చెందిన పానుగంటి వెంకటేశ్వరరావు, ఎస్‌వీఎన్ కాలనీ ఒకటోలైను వాసి షేక్ ఖాజా, శివరామనగర్ మూడో వీధి వాసి ముడియాల సుదర్శనరెడ్డి, నగరంపాలెంకు చెందిన వాలేరు క్రాంతి, మద్దూరి రమేష్, అంకమ్మన గర్ ఆరో వీధికి చెందిన బడుగు శ్యాంసన్, ఏటీ అగ్ర హారం ఆరో వీధి వాసి ఎలమంచి రామారావు, శ్రీని వాస కాలనీకి చెందిన ఓర్సు వెంకటేష్, వెంగళాయ పాలెం గ్రామానికి చెందిన ఓ మైనర్, బాలాజీనగర్ ఒకటో వీధికి చెందిన షేక్ కాలేషాను అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ప్రతిభ చూపిన తెనాలి మూడో పట్ట పీఎస్ సీఐ రమేష్ బాబు, కానిస్టేబుళ్లు మురళీ, ఎస్.జయకర్ బాబు, శ్రీనివాసరావు, రామకృష్ణ, నరేంద్ర, నాగ శ్రీను, శ్రీరామమూర్తిలను అభినందించి, నగదు రివార్డులు, ప్రశంస పత్రాలను అందించారు.

**పదుల సంఖ్యల్లో కేసులు..**

కూరగాయలు విక్రయించే పానుగంటి వెంకటేశ్వరరావు ఒక ముఠాకు కీలకంగా వ్యవహరించేవాడు. అతని ముఠాలోని నలుగురితో చోరీలు చేయిం చేవాడు. ఇందులో యాభై ఏళ్ల రమేష్ జనం రద్దీగా ఉండే చోట నిలబడి, ఒంటరిగా ఉ న్న వారితో మాట్లాడేవాడు. వారితో ఎక్కడికెళ్తున్నారని తెలుసుకుని, ముఠా సభ్యు ల్లో ఒకరికి ఫోన్ ద్వారా స మాచారం చేరవేసేవారు. దీం తో ఆటోలో అయిదుగురితో పా టు ప్రయాణికుడ్ని ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లేవారు. ఆటో నిలిపి, బెదిరించి డబ్బులు, నగలు తీసుకునే వారు. మిగతా రెండు ముఠాల్లోని సభ్యులు సైతం ఇదే తరహాలో చోరీలకు పాల్పడేవారు. అయితే వీరంతా గుంటూరు లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. చెడు అలవాట్లకు బానిసై, 2016 నుంచి ఈ తరహా చోరీలకు తెరలేపారు. విజయవాడ, గుంటూరు జిల్లాలో పానుగంటిపై 14 కేసులు, ముడియాల సుదర్శన్‌రెడ్డి 16 కేసులు, క్రాంతిపై 2 కేసులు, మద్దూరి రమేష్‌పై 3 కేసులు, మిగతా వారిలో కొంద రిపైనా కేసులు ఉన్నాయన్నారు.

**త్వరలో ఆటోలకు నంబర్లు**

ట్రాఫిక్ పోలీసుల నంబర్లను పునఃప్రారంభిస్తామని అన్నారు. ఆటోల్లో ప్రయాణించే వేళల్లో వేరే దారిలోకి ఆటోలు వెళ్తే టోల్‌ఫ్రీ నంబర్– 112కు లేదా, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, తెనాలి మూడో పట్టణ సీఐ రమేష్, ఎస్ఐ ఎన్.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యం తూచ్!

### ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం రికార్డులకే పరిమితం

- వైద్య సేవలు అందించకుండానే అనుమతులు
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న ఆస్పత్రుల నిర్వాహకులు
- ఆస్పత్రుల యాజమాన్యాలతో వైద్యాధికారుల లాలూచీ!
- నష్టపోతున్న పేద రోగులు



గుంటూరు మెడికల్: పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్ప త్రుల్లో ఉచితంగా ఖరీదైన వైద్య సేవలను అందించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలకు ప్రభుత్వ వైద్యాధికారులు, ఆస్పత్రుల నిర్వాహకులు తూట్లు పొడుస్తున్నారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించకుండానే అందించినట్లుగా ఆస్పత్రుల యజ మానులు తప్పుడు రికార్డులు చూపెడుతూ మభ్యపె డుతున్నారు. వారి తప్పుడు పనులకు ప్రభుత్వ వైద్యా ధికారులు అందినంత తాయిలాలు పుచ్చుకుని వత్తాసు పలుకుతూ పేదల జీవితాలతో ఆటలా డుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపో తుంది. వివరాల్లోకి వెళితే... ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు, వారి కుటుంబ సభ్యులకు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర సిబ్బందికి వైద్య సేవలం దించేందుకు ప్రైవేటు ఆస్పత్రులు, రిఫరల్ ఆస్పత్రుల నిర్వాహకులు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకోవాలి. ఆ సర్టిఫికెట్‌ను పొం దాలంటే 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ అటెం డెన్స్ రూల్స్, 1972'ను ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహ కులు తప్పనిసరిగా పాటించాలి. కాని జిల్లాలో ఉన్న కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఈ నిబం ధనలు అమలు కావటం లేదనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**నిబంధనలు ఇవీ..**

తెల్లరేషన్ కార్డుదారులకు, దారిద్ర్య రేఖకు దిగువ వర్గాలకు ఉచితంగా ప్రభుత్వ గుర్తింపు ఉన్న కార్పొ రేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్య సేవలను అందించాలి. ఆస్పత్రిలో ఉన్న పడకల్లో ఐదుశాతం ఈ పేదల కోసం కేటాయించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచిత వైద్య సేవలను ఇవ్వాలి. అవసరమైతే ఆప రేషన్లు కూడా ఉచితంగా చేయాలి. ఓపీ సేవలు, వార్డు సేవలు రెండూ కూడా ఉచితంగా అందించాలి. అంతే కాకుండా రెండు గ్రామాలను దత్తత తీసుకుని ఆ రెం డు గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి నెలా ఒక ఉచిత వైద్యశిబిరం ఆ గ్రామంలో ఏర్పాటు చేయాలి.

**విద్యార్థులకు సైతం...**


కేవలం పెద్దవాళ్లకే కాకుండా నిబంధనల ప్రకారం విద్యార్థులకు కూడా ఉచిత వైద్య సేవలను అందిం చాల్సి ఉంది. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ స్కూల్స్, ఎస్టీ హాస్టల్స్, ఎస్టీ ఆశ్రమ్ స్కూళ్ల విద్యా ర్థులకు, మా బడి స్కూళ్ల విద్యార్థులకు ఉచితంగా వైద్య సేవలను అందించాలి. వీరితో పాటుగా ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్, జిల్లా రిఫరల్ కమిటీ, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఇతర ప్రభుత్వ అధికారులు రిఫర్ చేసే విద్యార్థులకు కూడా గుర్తింపు ఉన్న ఆస్పత్రులు ఉచితంగా సేవలందించాలి. తు.చ తప్పకుండా ఈ నిబంధనలు పాటిస్తున్న రిఫరల్ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు మాత్రమే ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి ఉంది. కాని జిల్లాలో రెన్యువల్ అయిన ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్యం అందించటం లేదనే విమర్శలు బహిరంగం గానే వినిపిస్తున్నాయి.

### మొక్కుబడి తనిఖీలతో సరి..

ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారో లేదో తనిఖీ చేసేందుకు విజయవా డకు చెందిన డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం జిల్లాకు చెందిన పలు వురు వైద్యులు, వైద్యాధికారులను ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశా లకు చెందిన సీనియర్ వైద్యులను నియమిస్తుం ది. ఒక్కో ఆస్పత్రికి ఒక్కో స్పెషాలిటీకి చెందిన వైద్యులు, వైద్యాధికారులు తనిఖీ చేసేందుకు వెళ్లి నిబంధనలు అన్నీ పాటిస్తున్నట్లుగా రిపోర్టు పంపి స్తారు. ఇక్కడి వైద్యులు పంపిన నివేదికల ఆధా రంగానే డీఎంఈ కార్యాలయం నూతనంగా గుర్తింపు ఇవ్వటం లేదా గుర్తింపు ఉన్న ఆస్పత్రు లకు రెన్యువల్ ఇవ్వటం జరుగుతుంది. అయితే జిల్లా అధికారులు ఇచ్చే రెన్యువల్ రిపోర్టు నివేది కలు వాస్తవానికి ఆమడ దూరంలో, ఆస్పత్రుల నిర్వాహకులకు అనుకూలంగా ఉంటున్నట్లు విమ ర్శలు ఉన్నాయి. తనిఖీ కోసం వెళ్లే వైద్యులకు, వైద్యాధికారులకు సదరు ఆస్పత్రి నిర్వాహకులే కారు ఏర్పాటుచేసి, మధ్యాహ్నం స్టార్ హోటళ్లలో విందు భోజనాలు ఏర్పాటుచేసి, తిరిగి వచ్చే సమ యంలో భారీగానే తాయిలాలు ఇస్తున్నట్లు చెవులు కొరుక్కుంటున్నారు. ముఖ్యంగా గుం టూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ నుం చి తనిఖీల కోసం వెళ్ళిన సందర్భాల్లో వైద్య కళా శాల, జీజీహెచ్ అభివృద్ధి కోసం అంటూ బహుమ తుల రూపంలో అధిక మొత్తాల్లోనే తీసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో విజిలెన్స్ అధికారులు కూడా ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్య సేవలను అందించటం లేదనే విషయాన్ని నిర్ధా రించడం విశేషం.

# పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి

### జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తికి జ్ఞాపిక బహూకరిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, అభివృద్ధి సాధ్యమవుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొ న్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మంగళ వారం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రపంచ మరు గుదొడ్ల దినోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.క ల్యాణ చక్రవర్తి అధ్యక్షత వహించిన సభలో హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారి శుధ్య నిర్వహణ మెరుగ్గా ఉందని, ఈ మార్పు ఇదేవిధంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసర ముందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్లాప్ మిత్ర సిబ్బందిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. జిల్లాస్థాయిలో వ్యక్తిగత మరు గుదొడ్ల సుందరీకరణ, వినియోగాన్ని ప్రోత్సహించ డంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రత్తిపాడు మం డలం గనికపూడి గ్రామ పంచాయతీ తరఫున సర్పంచ్ కె.తులశమ్మ జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకు న్నారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, జిల్లా పం చాయతీ అధికారి బీవీఎస్ సాయికుమార్, గృహ నిర్మాణశాఖ పీడీ జేవీఎస్ఆర్‌వీ ప్రసాద్, స్వచ్ఛ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ అర్జునరావు పాల్గొన్నారు.

# బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనం ప్రారంభం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వైద్యశాఖా ధికారి డాక్టర్ విజయలక్ష్మితో కలిసి నిర్వహిం చిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల సురక్షా రక్ష కార్యక్రమంలో భాగంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, జిల్లా క్షయ నియంత్ర ణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, అధి కారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రాష్ట్ర క్యారమ్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ




గుంటూరు వెస్ట్(క్రీడలు): చిత్తూరులో ఇటీవల ముగిసిన ఆంధ్ర రాష్ట్ర 3వ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో వెటరన్ మహిళల విభాగంలో కెజియా జవహర్‌కు బంగారు, వెటరన్ పురుషుల్లో వి.వెంకటేశ్వర్లుకు రజతం, పాల్ సుధాకర్‌కు కాంస్యం, పురుషులు విభాగంలో జి.జయకుమార్‌కు కాంస్య పతకాలు సాధించారన్నారు. విజేతలకు ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీఆర్ నీరజ్ కుమార్ సంపతి, చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావులతోపాటు జిల్లా కమిటీ సభ్యులు అభినందించారన్నారు.

### రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం

జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు



తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల ద్వారా నియమ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం దుగ్గిరాల గ్రామంలో ఏఓ శిరీషతో కలసి ఆయన పర్యటించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మిల్లర్లకు తరలించేందుకు అన్నిఏర్పాటు చేశామని, ధాన్యం నింపేందుకు గోతాలు, రవాణాకు వాహనాలు రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. ఏఈఓలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

### స్కేటింగ్ జాతీయ పోటీల్లో జెస్సీరాజ్‌కు రజతం



మంగళగిరి: 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో మంగళగిరికి చెందిన క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ సత్తాచాటి రజత పతకం సాధించింది. తమిళనాడు రాష్ట్రం పొలాచి నగరంలోని కేశవ విద్యామందిర్ స్కేటింగ్ పార్క్‌లో స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి 10 వరకు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 14, 17 వయస్సు విభాగంలో జెస్సీరాజ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించి రజత పతకం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు జెస్సీరాజ్‌కు అభినందనలు తెలిపారు.

# ముగిసిన ఇంటర్ కాలేజ్ వాలీబాల్ టోర్నమెంట్

ట్రోఫీని కైవసం చేసుకున్న కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడా రంగంలో భారతదేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటే విధంగా క్రీడాకారులు తయారవ్వాలని, ఓటమిని గెలుపునకు సోపానాలుగా మలుచుకోవాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. గత రెండు రోజులుగా మండలంలోని చౌడవరం గ్రామంలోగల కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంటర్ కళాశాలల వాలీబాల్ మెన్స్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. టోర్నమెంట్‌లో ఫైనల్స్‌కి చేరిన నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య సాగిన పోటీలో ఇరు జట్ల క్రీడాకారులు ఆటలో వారి మెలకువలను ప్రదర్శిస్తూ సమాన పాయింట్స్ సాధిస్తూ ఉత్కంఠ భరితంగా ఆడారు. కృష్ణవేణి జట్టు మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్టు రెండో స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. తృతీయ స్థానంలో ఏఎన్‌యూ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు, నాల్గో స్థానంలో ధనలక్ష్మి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచాయి. టోర్నమెంట్‌లో ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన క్రీడాకారులను ఏఎన్‌యూ వాలీబాల్ (మెన్) జట్టుకి ఎంపిక చేశారు. ఎన్నికైన క్రీడాకారులు ఈనెల కేరళ యూనివర్సిటీలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీస్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు ఏఎన్‌యూ అబ్జర్వర్స్, సెలక్షన్ కమిటీ సభ్యులు ప్రకటించారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏఎన్‌యూ టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ వీసీకి గౌరవ కల్నల్ ర్యాంక్


వీసీ పి.నాగభూషణ్‌కు గెజిట్ నోటిఫికేషన్ అందజేస్తున్న ఎన్‌సీసీ ఎయిర్ కమోడర్ వి.మధుసూదన్ రెడ్డి

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు న్యూఢిల్లీలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా – మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను మంగళవారం అందించింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ – తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడర్ వి.మధుసూదన్ రెడ్డి విజ్ఞాన్ యూనివర్సిటీకి విచ్చేసి వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీను ఏకీకృతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థుల్లో క్రమశిక్షణ, స్నేహభావం, నిబద్ధత, సమగ్ర అభివృద్ధికి చేస్తున్నటువంటి కృషికి గాను ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందించిన్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ కోర్సును యాడ్–ఆన్ డిప్లొమాగా ప్రవేశపెట్టారని తెలియజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్ లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ర్యాంక్ వలన ఎన్‌సీసీ కార్యకలాపాల నిర్వహణలో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు కల్నల్ సంజయ్ గుప్త, గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్, ఇతర గ్రూప్ కమాండర్లు, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్స్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధ్యాపక సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

### జీజీహెచ్‌లో అడిషనల్ డీఎంఈ సమీక్ష

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేష్ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆసుపత్రిలో సమస్యలపై వైద్యులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో మందులు లేవని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో టెండర్లు పిలిచి మందులు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. హెచ్‌డీఎస్‌కు ఆదాయ వనరుల మార్గాలను అన్వేషించాలని, అందుకు పలు సూచనలు చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ కేసులు పెంచాలని, గతంలో పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ నిధులు విడుదలయ్యేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, పలు వైద్య విభాగాధిపతులు, వైద్యులు, వైద్య సిబ్బంది, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### సందేశాత్మకం 'పడమటి గాలి'



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై పండు క్రియేషన్స్ కొప్పోలు (ఒంగోలు) వారి నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం పడమటి గాలి సంక్షిప్త రూపం నాటకం ప్రదర్శించారు. భార్యాభర్తల అనుబంధాలు, తల్లిదండ్రులు, బిడ్డల మధ్య మమకారాన్ని ధ్వంసం చేస్తున్న ఆర్థిక సంబంధాలు, రైతు కూలీలను రైతులకు దూరం చేస్తున్న విషాదాలు వంటి అనేక విషయాలపై ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు రచించగా, గుమ్మళ్ల బలరామయ్య దర్శకత్వం వహించారు. అనంతరం మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పడమటి గాలి నాటకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో కందిమళ్ళ సాంబశివరావు, సత్యనారాయణ, దివి కుమార్, ఉన్నం వెంకటశేషయ్య పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఇండియా ఎస్ఎంఈ సంస్థతో ఒప్పందం
- మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్


ఇండియా ఎస్ఎంఈ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుర్చుకుంటున్న మెప్మా డైరెక్టర్

తాడేపల్లిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దానిలో భాగంగా మహిళలు మెప్మా ద్వారా మరింత ఆర్థిక వనరులు సమకూర్చేందుకు ఇండియా ఎస్ఎంఈ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ చెప్పారు. మంగళవారం తాడేపల్లి రాష్ట్ర మెప్మా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇండియా ఎస్ఎంఈ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం చేసుకున్నామని, ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 2.79 లక్షల డ్వాక్రా సంఘాల్లోని 28,77,109 మంది పేద, నిరుపేద మహిళలకు లబ్ధి చేకూరే విధంగా ఈ సంస్థలో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో మెప్మా మిషన్ మేనేజర్ రంగాచార్యులు, శ్రీనివాస్, ఇండియా ఎస్ఎంఈ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి ఈత పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి


వై.మధుకిషోర్

నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి స్విమ్మింగ్ (ఈత) పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి వై.మధుకిషోర్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. విశాఖలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 7,8 తేదీలలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి శీతాకాలపు సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో మధుకిషోర్ 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. ఈనెల 28వ తేదీన విజయవాడలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో మధుకిషోర్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

### 24 గంటల్లోనే బాలిక మిస్సింగ్ కేసు ఛేదన

విజయపురిసౌత్: విజయపురిసౌత్ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే మిస్సింగ్ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే మాచర్ల మండలం చింతల తండా గ్రామానికి చెందిన బాలిక జటావత్ విజయమ్మ గత సోమవారం అర్ధ రాత్రి ఇంటిలో కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు బందాలుగా ఏర్పడి బాలిక కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. తెలంగాణ ప్రాంతంలో బాలిక ఆచూకీ కనుక్కున్నారు. అనంతరం బాలికను తీసుకొచ్చి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. 24 గంటల్లోపే బాలిక ఆచూకీ కనిపెట్టడంతో ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, ఏఎస్ఐలు సోమలా నాయక్, సోమయ్య, పోలీస్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

### సాగర్ జలాశయంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



విజయపురిసౌత్: మాచర్ల మండలం నాగార్జున సాగర్ కృష్ణా జలాశయంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం జరిగింది. విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ కథనం ప్రకారం విజయపురిసౌత్‌లోని మేకల గొంది సమీపం లోని కృష్ణా జలాశయం వద్ద ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో పొలాలకు వెళ్తున్న రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ మహమ్మద్ షఫీ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ప్రధానోపాధ్యాయురాలి హఠాన్మరణం

విధుల్లో ఉండగా అస్వస్థత



దుర్గి: కంచరగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పి.భార్గవి (30) సోమవారం రాత్రి హఠాన్మరణం చెందారు. కంచరగుంట పాఠశాలలో సోమవారం విధులు నిర్వహిస్తున్న సమయంలో భార్గవి అస్వస్థతకు గురయ్యారు. నీరసంగా ఉండడంతో తోటి ఉపాధ్యాయులకు చెప్పి దుర్గిలో నివసిస్తున్న తన ఇంటికి చేరుకున్నారు. అకస్మాత్తుగా గుండెనొప్పి రావటంతో కారులో మాచర్ల వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు బంధువులకు తెలిపారు. గతంలో ముటుకూరు, ఆత్మకూరు ప్రాథమిక పాఠశాలలో ఆమె పనిచేశారు. విషయం తెలుసుకున్న ఎస్టీయూ నాయకులు, తోటి ఉపాధ్యాయులు భార్గవి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ళ మండలంలోని జానపాడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

### జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఇసుక దర్శి విద్యార్థి



మార్టూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఇసుక దర్శి గ్రామానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 9వ తేదీన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన 11 సంవత్సరాల విద్యార్థి కర్పూరపు హితేష్ మొదటి బహుమతి సాధించాడు. తద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హితేష్ ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్నాడు. బాలుడిని ప్రిన్సిపల్ మనీష్ కుమార్, గురువు వెంకటేష్, తల్లిదండ్రులు కర్పూరపు శివపార్వతి, అనిల్ కుమార్, స్థానికులు అభినందించారు.

### ట్రాక్టర్ల ఇసుక దందా

నరసరావుపేట: ట్రాక్టర్లకు ఉచిత ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. చోటామోటా టీడీపీ నేతలు జిల్లాలోని పలు రీచ్‌ల నుంచి ట్రాక్టర్లతో ఇసుకను తీసుకొచ్చి నరసరావుపేట పట్టణంలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో ఇసుక ట్రాక్టర్లు బారులు తీరి కనిపించడం దీనికి నిదర్శనం. ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల నుంచి రూ.6వేలకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. పట్టణంలోని ఇసుక, ఇతర బిల్డింగ్ మెటీరియల్ విక్రయించే మారుబేరగాళ్లకు అధికంగా సరఫరా చేస్తున్నారు. గృహ నిర్మాణదారులకు మాత్రం ఇసుక టన్ను రూ.1,500 తక్కువకు లభించడం లేదు.



## గుర్రువు గారు.. ఇది తగునా..?

విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించి తరగతి గదిలో నిద్రపోయిన హెచ్ఎం

ప్రత్తిపాడు: విద్యార్థులను పక్కనబెట్టి ఓ గురువు తరగతి గదిలో గుర్రుపెట్టి నిద్దరోతున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి.నారాయణ పాఠశాలలో ఉన్న ఒకటి, రెండు తరగతుల విద్యార్థులను పక్కనున్న అంగన్‌వాడీ కేంద్రంలోనికి పంపి, ఆయన మాత్రం పాఠశాల తరగతి గదిలో కింద బండలపై చక్కగా నిద్రపోయాడు. విషయం జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక దృష్టికి వెళ్లడంతో ఆమె విచారణకు ఆదేశించారు. ఎంఈఓలు సీహెచ్ రమాదేవి, జి.లీలారాణిలు పాఠశాలకు వెళ్లి విచారణ చేసి హెచ్ఎంతో పాటు పక్కనున్న అంగన్‌వాడీ సిబ్బంది నుంచి లిఖితపూర్వక స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. నివేదికను డీఈఓకు పంపారు. ఘటనపై స్పందించిన డీఈఓ హెచ్ఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చి, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# లైంగికదాడి కేసులో నిందితుడు అరెస్ట్

- మహిళపై ఉద్దేశపూర్వకంగానే లైంగికదాడి
- కేసు నమోదులో ఎటువంటి అలసత్వం లేదు
- నార్త్‌జోన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ



నిందితుడు రామారావు అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరులో నివాసముండే ఓ మహిళను ఉద్దేశపూర్వకంగానే యువకుడు లైంగికదాడి చేశాడని, నిందితుడు చెబుతున్నట్లుగా క్షణికావేశంలో జరిగింది కాదని నార్త్‌జోన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ట్రైనింగ్ డీఎస్పీ భార్గవి, తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆదివారం అర్ధరాత్రి తాడేపల్లి పట్టణానికి చెందిన తెంపర్ల రామారావు తన స్నేహితుడి తల్లిపై లెంగికదాడికి పాల్పడ్డాడన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి బాధితురాలి కుమారుడికి, నిందితుడు రామారావుకు మధ్య స్నేహముందన్నారు. తన స్నేహితుడు ఇంట్లో లేని విషయం తెలుసుకున్న రామారావు అతని తల్లిపై లైంగికదాడికి పాల్పడ్డాడన్నారు. ఈ కేసులో పోలీసులు ఎటువంటి జాప్యం చేయలేదని, ఆ మహిళ సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని వెంటనే గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు జరిగిన సంఘటన వివరాలు తెలియజేశామని, వెంటనే బాధిత మహిళ ఇంటికి వెళ్లి ఆధారాలు సేకరించి కేసు కూడా నమోదు చేశామని, బాధితురాలిని వైద్యనిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి నిందితుడు రామారావును రెండు గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ కేసులో వివరాలు సేకరించేందుకు తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు, ట్రైనింగ్ డీఎస్పీ భార్గవి, ఇతర సిబ్బంది ఎంతో శ్రమించారని ఆయన అన్నారు.

# పూర్వ విద్యార్థులే బాలకుటీర్ ప్రగతికి చిహ్నాలు

–ఆచార్య బేతవోలు రామబ్రహ్మం


రచయిత్రి సుజాతకు మాలతీ ప్రమదా సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ, విదేశాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులే బాలకుటీర్ ప్రగతికి చిహ్నాలుగా నిలిచారని కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ 27వ లలిత కళా ఉత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఏటీ అగ్రహారంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ మంగాదేవి, ప్రభావతి, జయశ్రీ కృషితో విరాజిల్లుతున్న శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌కు నాలుగో ముఖంగా దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి రచించిన స్వీయకథ అంకురం నుంచి అనంతం ఆమె జీవితాన్ని తెలియజేస్తుందని చెప్పారు. ఈసందర్భంగా 'అంకురం నుంచి అనంతం' పేరుతో రూపొందించిన డాక్టర్ నన్నపనేని మంగాదేవి స్వీయకథ పురస్కారాన్ని రచయిత, పాఠశాల విద్యాశాఖ విశ్రాంత డైరెక్టర్ వాడ్రేవు చినవీరభద్రుడు ఆవిష్కరించారు. పాఠశాల సీఏఓ రఘురామ్ మాట్లాడారు.

**పురస్కారాల ప్రదానం..**

లలిత కళా ఉత్సవంలో భాగంగా తెలుగు రచయిత్రి, పాత్రికేయురాలు, స్త్రీవాద ఉద్యమంతో సాహిత్య జీవితాన్ని గడుపుతున్న చేబ్రోలు సుజాతకు మాలతీ ప్రమదా సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అదే విధంగా బాల సాహిత్యంలో విశేష కృషి చేసిన నంద్యాల జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు డాక్టర్ ఎం.హరికిషన్‌కు మంగాదేవి బాల సాహిత్య పురస్కారం, హైదరాబాద్‌కు చెందిన యువ అవధాని, వర్ధమాన కవయిత్రి అయిన 8వ తరగతి విద్యార్థిని అయ్యల సోమయాజుల లక్ష్మిఅహలను ప్రతిభా పల్లవం పురస్కారంతో సత్కరించారు. అదే విధంగా ఉదయం జరిగిన లలిత కళా సంగీత ఉత్సవంలో భాగంగా కళా, సాంస్కృతి పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, సహ కార్యదర్శి జయశ్రీ, మరుద్వతి, ఆకాశవాణి పూర్వ డైరెక్టర్ ఎం.కృష్ణకుమారి, ఏఎన్‌యూ విశ్రాంత వీసీ రావెల సాంబశివరావు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళలపై హింసను అరికట్టాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు

లక్ష్మీపురం: గుంటూరులో రమ్య అనే బీటెక్ విద్యార్థిని ఆగస్టు 15న అత్యంత దారుణంగా నడి రోడ్డు మీద హతమార్చారని, మహిళలపై రోజురోజుకీ దారుణాలు పెరిగి పోతున్నా ప్రభుత్వాలు అరికట్టే దిశగా చర్యలు చేపట్టడం లేదని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. నవంబర్ 25వ తేదీ నుంచి డిసెంబర్ 10 వరకు హింస వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళలపై అత్యాచారాలు అరికట్టాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఐద్వా నగర అధ్యక్షురాలు జి.రమణ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా 1999లో ఐక్యరాజ్యసమితి హింస వ్యతిరేక వారోత్సవాలు జరపాలని పిలుపునిచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై హింసను తగ్గించే చర్యలను తీసుకోవడం లేదన్నారు. గత ఏడాది సగటున రోజుకు 140 మంది మహిళలు, బాలికలు వారి భాగస్వాముల చేతుల్లో మరణించారని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు తెలియజేస్తున్నాయని, మహిళలకు ఇంటి చుట్టుపక్కల వాతావరణమే ప్రాణాంతకంగా మారిందని అన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి షేక్ సమీర్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ, గంజాయి, అశ్లీల వెబ్‌సైట్లను నియంత్రించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని, వాటిని నియంత్రించితే తప్ప మహిళలకు, విద్యార్థులకు న్యాయం జరగదని అన్నారు. ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి, బి.సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు షేక్ ఖాసిం, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు సౌమ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

### యార్డుకు 51,699 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 51,699 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 48,739 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ.13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.7,500 నుంచి రూ.16,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 40,624 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.